క్లుప్తంగా

అర్హులందరికీ పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీఓ

దక్కిలి: మండలంలోని జాబ్‌కార్డు కలిగి అర్హులైన ప్రతిఒక్కరికీ 100 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏపీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ మండలంలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు షఫీ, గిరి, సరిత, బీఎఫ్‌టీ శివయ్య పాల్గొన్నారు.

కొలతల మేర పనులు


సమీక్షలో మాట్లాడుతున్న ఏపీడీ

చిల్లకూరు: ఉపాధి పథకం కింద పనిచేసే కూలీలు వారికి ఇచ్చిన కొలతల మేర పనులు చేసి రూ.300 కూలి తీసుకునేలా పనులు చేయించాలని ఏపీడీ వరప్రసాద్‌రావు ఆదేశించారు. మండల ఉపాధి కార్యాలయంలో బుధవారం మండలంలోని ఉపాధి క్షేత్ర సహాయకులతో ఎంపీడీఓ భానుమూర్తి, ఏపీడీ వరప్రసాద్ రావు, ఉపాధి ఏపీఓ గిరిబాబు సమీక్ష నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పూర్తి స్థాయిలో కొలతలు లేకుండా పనులు చేస్తున్న వారిలో చిల్లకూరు మండలంలో ఎక్కువ మంది కూలీలు ఉన్నారని అన్నారు. దీనిని సరి చేసేందుకు ప్రతి క్షేత్ర సహాయకులు తమ పరిధిలోని కూలీలకు రూ.300 వేతనం అందించేలా పనులు చేపట్టి కొలతల మేర పనులు పూర్తి చేయించాలన్నారు. ఎంపీడీఓ భానుమూర్తి మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచి ప్రతిఒక్కరికీ పనులు కల్పించేలా చూడాలని అన్నారు.

దొరవారిసత్రంలో వర్షం


దొరవారిసత్రంలో కురుస్తున్న వర్షం

దొరవారిసత్రం: మండలం పరిధిలో బుధవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో జనం ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు. వెదురుపట్టు, తల్లంపాడు, కమ్మకండ్రిగ, కొత్తకండ్రిగ, వేణుంబాకం, లింగంపాడు, తనియాలి గ్రామాల్లో ఎడగారు కింద సాగులో ఉన్న వరి పంటకు కురిసిన వర్షం కొంత ఊరటను ఇచ్చినట్లు ఆయా ప్రాంతాల్లోని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఎడగారు కింద సాగు చేసే పంట పొలాల్లో వరినాట్లు, పొలాన్ని దమ్ము చేయడం, వరి నారు తీయడం వంటి పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు.

అన్ని వసతులతో పాఠశాల ప్లస్


ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్ ఇస్తున్న హెచ్‌ఎం

చిట్టమూరు(చిల్లకూరు): పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిని అందించేలా విద్యాశాఖ నూతనంగా పాఠశాలలోనే ప్లస్ విద్యను బోధించేందుకు శ్రీకారం చుట్టిందని మెట్టు గ్రామంలోని పీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.పార్థసారధి బుధవారం తెలిపారు. పాఠశాలలో కో ఎడ్యుకేషన్ కింద ఇంటర్ ప్రవేశ పెడుతున్నామని ఇక్కడ ఎంపీసీ, బైపీసీలో తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కూడా ప్రవేశ పెడుతున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే 17 అడ్మిషన్లు అయ్యాయని, త్వరలోనే రెండు గ్రూపులలో 40 మంది విద్యార్థుల చొప్పున అడ్మిషన్లు జరిగేలా అవగాహన కల్పిస్తున్నామని హెచ్‌ఎం అన్నారు.

పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్

పెళ్లకూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బుధవారం పెళ్లకూరుకు చెందిన మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు మెరియం ఆదెమ్మ(58)కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎంపీపీ ఆదెమ్మ ఇటీవల మృతిచెందారు. దీంతో కామిరెడ్డి పెళ్లకూరులోని మృతురాలు నివాసానికి వెళ్లి ఆదెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

నారసింహా...నమోస్తుతే

- ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

దక్కిలి: మండలంలోని వెంబులూరు పంచాయతీలోని (పెదకోన) వెలుగొండలు కింద వెలసియున్న యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలు, అశేష భక్త జనసందోహమే అతిథులుగా, అర్చకులే పెళ్లి పెద్దలుగా లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి దేవేరుల కల్యాణం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఉదయం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అలంకార మండపంలో వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కల్యాణం నిర్విఘ్నంగా జరగడానికి ముందుగా విశ్వక్సేన పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారు అమ్మవారు గోత్రాలు చెప్పి కన్యాదాన కార్యక్రమం జరిపారు. స్వామి అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం తలపై ఉంచి అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్ ఏర్పాట్లు చేశారు.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు


దక్కిలి: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


బాలాయపల్లి: పూజలు అందుకున్న లక్ష్మీనరసింహస్వామి

వెంకటగిరిరూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలోని 9వ బెటాలియన్ వద్ద కొండపై వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 64 జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. 9వ బెటాలియన్ అధికారులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి నిర్వహించిన చందనాలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం స్వామి వారి గరుడోత్సవం నిర్వహించారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలంలోని అలిమిలి పంచాయతీ కనుమరాయి కొండపై వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నృసింహుని జయంతి వేడుకలు బుధవారం కనులపండువగా జరిగాయి. ఉదయం వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణం కనులపండువగా సాగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీపై కొలువుంచి పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు

గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

చిల్లకూరు: లక్ష్మీనరసింహస్వామి జయంతి పురస్కరించుకుని బుధవారం స్వామి, అమ్మవార్లు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కలవకొండ గ్రామంలో వెలసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించి ఆలయ అనివెట్టి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం, సాయంత్రం నిత్య హోమాలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. ఉభయకర్తలుగా తిమ్మనగారిపాళెంకు చెందిన బుస్సారెడ్డి రాధాక్రిష్టారెడ్డి, సులోచనమ్మ, చెన్నైకు చెందిన పొన్నలూరు రామచంద్రారెడ్డి, కవిత, తిప్పగుంటపాళెంకు చెందిన భక్త బృందం, తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ యరటపల్లి పృథ్వీరెడ్డి, మాజీ చైర్మన్ యరటపల్లి శరణ్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ఈఓ తాతా శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నరసింహస్వామితో పాటు వ్యూహలక్ష్మి అమ్మవార్లకు హోమ పూజలను జరిపారు. అనంతరం భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల కల్యాణోత్సవ వేడుకలను కనులపండువగా భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్థానిక వ్యూహ లక్ష్మి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్లకు గురువారం సాయంత్రం లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మోహన్‌కృష్ణ శర్మ తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి


నాయుడుపేట: తులసి దళాల అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

హనుమంతునిపై కరిమాణిక్యస్వామి విహారం


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేద పండితులు


హనుమంతునిపై విహరిస్తున్న స్వామివారు

-వేడుకగా స్వామి వార్ల చప్పర ఉత్సవం

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంతుని వాహనంపై ఆశీనులై గ్రామ పురవీధులలో విహరించారు. ఉదయం ఆలయం వద్ద టీటీడీకి చెందిన వేదపండితులు స్వామివార్ల చప్పర ఉత్సవాన్ని నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు. తర్వాత ఊంజల సేవ నిర్వహించారు. గ్రామంలోని మాడ వీధుల్లో ప్రతి ఇంటి ముంగిట స్వామివారిని ఆహ్వానిస్తూ గ్రామస్తులు పూజలు జరుపుకున్నారు. రాత్రి హనుమంతుని వాహనసేవలో టీటీడీకి చెందిన ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు హరిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

నేడు గరుడసేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో ద్వార దర్శనం పూజలు నిర్వహిస్తారు. రాత్రి స్వామివారిని గరుడ వాహనంలో ఊరేగిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

ఎలాంటి వివాదాలు తలెత్తకూడదు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి

-డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి

దొరవారిసత్రం: కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఏలాంటి వివాదాలు రాజకీయ పార్టీ నేతలు, ప్రజల మధ్య తలెత్తకూడదని నాయుడుపేట సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి సింగనాలత్తూరు గ్రామంలోని ఇరుపార్టీ నేతలు, స్థానికులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కౌంటింగ్ రోజు వీధుల్లో కేక్‌లు కట్ చేయడం, బాణసంచ పేల్చడం వంటివి చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. వివాదాలకు దారితీసేలా ఎక్కడ కూడా పార్టీల నేతలు ప్రజలను, వర్గాలను రెచ్చగొట్టకూడదన్నారు. ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఎస్‌ఐ తిరుమలరావు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై గోవిందుడి అభయం


సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: గోవింద రాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు బుధవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో శ్రీగోవింద రాజస్వామి అభయమిచ్చారు. కళాబృందాల ప్రదర్శనల మధ్య, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి చంద్రప్రభ వాహన సేవ కోలాహలంగా సాగింది. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి సూర్యప్రభ వాహన సేవ అత్యంత వేడుకగా నిర్వహించారు. భక్తజన బృందాలు చెక్కల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ సూర్యప్రభ వాహనదారుడై గోవిందుడు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి వారికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టీటీడీ అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు గోవిందరాజస్వామి రథోత్సవం

గోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. గురువారం ఉదయం 6.35 గంటల నుంచి రథంపై అధిరోహించిన స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

ఎస్‌కేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న పీరా కుమార్

గూడూరురూరల్: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న పీరాకుమార్‌కు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈయన వృద్ధి, అస్థిరత, (ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పంటలపై అధ్యయనం) అనే అంశాలపై సీనియర్ ప్రొఫెసర్ ఎన్ఆర్పీ రమణారెడ్డి మార్గదర్శకంలో పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలకుగాను యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రజినికి డాక్టరేట్


గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న వేముల రజిని

నాయుడుపేటటౌన్: పట్టణానికి చెందిన వేముల రజినీ బుధవారం రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బయోటెక్నాలజీపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ అందుకుంది. నెల్లూరు విక్రమ సింహపురి వర్సిటీలో బుధవారం జరిగిన స్నాతకోత్సవంలో రజినికి గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధనలు చేసి ఇందుకు సంబంధించిన తీసెస్‌ను విశ్వవిద్యాలయంకు సమర్పించడంతో ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. రజినీ ప్రస్తుతం నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ విభాగ టెక్నికల్ అధికారిణిగా పని చేస్తున్నారు. రజినిని పలువురు అధ్యాపకులు, సహచర సిబ్బంది అభినందించారు.

దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్: మండలంలోని పుదూరు గ్రామంలో గడ్డి మోపుల విషయమై వివాదం జరిగి కర్రతో మహిళపై మరో మహిళ దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పుదూరు గ్రామంలో ఎర్రబత్తిన విజయకు చెందిన గడ్డి మోపులను పెరివి చెంచులక్ష్మి ఇంటి సమీపంలో వేసింది. దీంతో చెంచులక్ష్మి మా ఇంటి ముందు గడ్డి మోపులు తీయాలని చెప్పడంతో వారి మధ్య వివాదం జరిగింది. విజయ కోపంతో సమీపంలో ఉన్న కర్ర తీసుకుని చెంచులక్ష్మి తలపై కొట్టి గాయపరిచింది. ఈ విషయమై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాయపడిన చెంచులక్ష్మిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కండలేరులో 6.707 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 6.707 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి


హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు


నాయుడుపేటటౌన్: వేసవి దృష్ట్యా మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కురుగొండ ధనలక్ష్మి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వర్షాలు పడే అవకాశం ఉండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి పథకం ద్వారా రైతులు పండ్లు, కొబ్బరి, పూల తోటల పెంపకం చేసుకుంటే వారి పంటకు సాగును బట్టి ధరలను ఉచితంగా పొందవచ్చునని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ అధికారులను కలిసి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అయితే పలు శాఖల అధికారులకు ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి శిక్షణ జరుగుతుండడంపై సమావేశానికి హాజరు కాలేదని ఏఓ సీహెచ్ కుసుమాంభ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అత్తికాయల కృష్ణవేణి, ఈఓపీఆర్డీ ఎం.గోపాల్, పీఆర్ ఏఈ వంశీ, గొట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శంకరయ్య ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గూడూరు విద్యార్థినికి బంగారు పతకం

గూడూరురూరల్: స్థానిక చర్చి కాంపౌండ్‌కు చెందిన స్వర్గీయ రెవరెండ్ మనోహరం కుమార్తె మంగళపూరు ప్రిస్కిల్లా బుధవారం నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంది. చర్చి కాంపౌండ్‌కు చెందిన ప్రిస్కిల్లా 2021వ సంవత్సరం యూనివర్సిటీలో ఎంఎస్సీ బయోటెక్నాలజీలో 9.83 జీపీఏ సాధించింది. ఆమె సాధించిన అత్యుత్తమ ఫలితాలపై యూనివర్సిటీ గవర్నర్ చేతుల మీదుగా స్నాతకోత్సవంలో బంగారు పతకం అందించింది. దీంతో పలువురు ఆమెను అభినందించారు.


గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న ప్రిస్కిల్లా

రాయంచపై జ్ఞాన ప్రదాయినిగా కటాక్షం


హంస వాహనంపై జ్ఞాన ప్రదాతగా..

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్వేత వస్త్రాలను ధరించి.. వేదాలను చేతబట్టి సరస్వతీదేవిగా హంస వాహనంపై విహరిస్తూ శ్రీస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శేషవాహనంపై గో సంరక్షణధారిగా భక్తులను అనుగ్రహించారు. వేకువజామున 4.30 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కార్యక్రమాలు. హోమ పూజలను పూర్తి చేశారు. 7.30 గంటలకు పిల్లనగ్రోవితో వేణుగోపాలునిగా సుగంధభరిత పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో స్వామివారి ఉత్సవమూర్తిని అలంకరించి చిన్న శేష వాహనంపై అధిష్ఠింపజేశారు. తదుపరి మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. ఆలయానికి చేరుకున్న వెంకన్నకు ఉభయ దేవేరులతో ఆగమోక్తంగా స్నపన తిరుమంజనంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం జ్ఞాన సరస్వతీదేవిగా ఊయలలో కొలువుదీర్చి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు సరస్వతీదేవిగా హంస వాహనంపై కొలువుదీరిన కల్యాణ వెంకన్నకు విశేష పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. గురువారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆకట్టుకున్న డ్రమ్ముల వాయిద్యాలు

వాహనసేవ ఊరేగింపులో సంప్రదాయ గ్రామీణ డప్పు వాయిద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాజమండ్రి, కొవ్వూరు, జగ్గంపేట, కనమిట్టలకు చెందిన 80 మంది సభ్యుల బృందం వాయిద్యాలను లయబద్ధంగా వాయించడం భక్తులను విశేషంగా అలరించింది. చిన్నపిల్లలు నృత్యం చేస్తూ అన్నమయ్య కీర్తనలకు కోలాటాలు ఆడుతూ స్వామి వారి వాహనసేవలకు అగ్రభాగాన సాగారు.